ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




జగిత్యాల

జిల్లా వార్తలు

3★★

శుక్రవారం 5 సెప్టెంబరు 2025

జలకళతో చింతకుంట చెరువు



చెరువులకు జల కళ..

- ఆగస్టులో 34 శాతం అధిక వర్షపాతం
- 11 మండలాల్లో అధికం..
- పెరిగిన భూగర్భ జలాలు

జగిత్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గడిచిన నెలలో వర్షాలు విస్తారంగా కురవడంతో చెరువులకు జల కళ సంతరించుకుంది. ఆగస్టులో 34 శాతం అధిక వర్షపాతం నమోదైంది. జూన్, జూలై నెలల్లో లోటు వర్షపాతం నమోదైన విషయం విదితమే. జిల్లా వార్షిక వర్షపాతం ఆగస్టు వరకు 238.7 మిల్లీమీటర్లు కాగా 319.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ప్రస్తుతం రుతుపవనాలు చురుగ్గా కదులుతుండడంతో జిల్లాలో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. సెప్టెంబర్‌లోనూ ఇదే కొనసాగితే వర్షపాతం అత్యధికంగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆగస్టులో 11 మండలాల్లో అధికంగా, 9 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఆగస్టు మూడో వారం నుంచి ఏకధాటిగా వర్షాలు కురుస్తుండడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, రాయికల్, బీర్‌పూర్, సారంగాపూర్, ధర్మపురి, బుగ్గారం, కొడిమ్యాల, వెల్గటూరు మండలాల్లో అధికంగా వర్షపాతం నమోదైంది. జగిత్యాల రూరల్, జగిత్యాల, మేడిపల్లి, కోరుట్ల, మెట్‌పల్లి, కథలాపూర్, మల్యాల, భీమారం మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఆగస్టులో కురిసిన భారీ వర్షాలతో జిల్లాలోని చెరువులు, కుంటలు, చిన్నచిన్న ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఇక జిల్లాలోని 600కుపైగా చెరువులు పూర్తిగా నిండాయి. పలు చోట్ల మత్తడి పారాయి. జిల్లా వ్యాప్తంగా 1,709మంది రైతులకు చెందిన 2,168ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు గుర్తించారు.

● రెండు నెలలు వర్షాలు లేక..

వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందస్తు వర్షాలు రైతులను మురిపించాయి. రైతులు ఉత్సాహంగా పంటలు సాగు చేశారు. రెండు నెలలు ఆశించిన వర్షాలులేక చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు బోసిపోయాయి. అడపాదడపా కురిసిన వర్షాలకు పంటలు సాగు చేయగా జూలైలో ఆశించిన వర్షాలు లేక వరినాట్లు వేయలేదు. నీటి సౌకర్యం ఉన్న రైతులు నాట్లు వేశారు. విత్తుకున్న పంటలు వడలిపోయే దశకు చేరాయి. ఆగస్టు మొదటి వారం వరకు ఎండలు మండిపోయాయి. రెండో వారం నుంచి కురిసిన ఎడతెరిపి లేని భారీ వర్షాలతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులోకి వరద నీరు చేరడంతో నారు పోసుకొని నాట్లు వేశారు. అప్పటికే విత్తుకున్న పంటలకు ప్రాణం పోయగా వరి సాగుకు కలిసి వచ్చాయి. దాదాపు పది రోజుల పాటు ఎడతెరిపి లేని వానలతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. పలు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు భారీగా పారింది. వారం రోజుల్లోనే అధిక వర్షపాతం నమోదై లోత ట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరి పంటలకు నష్టాన్ని తెచ్చి పెట్టింది.

● పైపైకి భూగర్భ జల మట్టం..

జిల్లాలో జూలై నెలాఖరుకు 4.49 మీటర్లుగా ఉన్న సగటు జలమట్టం ఆగస్టు నెలాఖరు వచ్చేసరికి 3.61 మీటర్లుగా నమోదైంది. బీర్‌పూర్‌లో 0.46 మీటర్లు, బుగ్గారంలో 4.30, ధర్మపురిలో 2.59, ఎండపల్లిలో 8.10, గొల్లపల్లిలో 2.24, జగిత్యాల రూరల్‌లో 0.93, జగిత్యాల అర్బన్‌లో 5.65, పెగడపల్లిలో 2.12, రాయికల్‌లో 2.89, సారంగపూర్‌లో, 4.12, వెల్గటూ రులో 2.98, కొడిమ్యాలలో 10.80, మల్యాలలో 5.66, ఇబ్రహీంపట్నంలో 2.83, కోరుట్లలో 7.55, మల్లాపూర్‌లో...

- మిగతా 6లో

నెలల వారీగా వర్షం (మిల్లీమీటర్లలో)

నెల	సాధారణం	కురిసింది	వ్యత్యాసం	స్థితి
జూన్	153	121	-21	లోటు
జూలై	285	211	-26	లోటు
ఆగస్టు	238.7	319.4	+34	అధికం



బీర్‌పూర్‌లో పంట పొలాల్లో ఇసుక మేటలను పరిశీలిస్తున్న అధికారులు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఏఐటియుసి నాయకులు

జగిత్యాల అర్బన్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి):మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు మధ్యాహ్న భోజన కార్మికులకు 10వేల వేతనం చెల్లిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారన్నారు. ఎవరినీ తొలగించకుండా జీవో విడుదల చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించి రెండు సంవత్సరాలు దాటుతున్నా ఇప్పటి వరకు అమలు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఇంచార్జి వెన్న మహేష్, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం అధ్యక్షురాలు సంగెం పద్మ, గుగ్గిల్ల శారద, కూన సరస్వతి, మాడిశెట్టి కిరణ్, అందే వంశీకృష్ణ, యాటకర్ల లక్ష్మీ, ఇప్పల మనమ్మ, మునుగోడు నర్సు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లు

భీమారం, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన జిర్ఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 32 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేశారు. జగిత్యాల లయన్స్ క్లబ్ సంయుక్తంగా రేకుర్తి ఆస్పత్రి సహకారంతో మండలంలోని ఒడ్యాడ్, రాగోజీపేట, వెంకట్రావుపేట, కమ్మరిపేట, భీమారం, రంగాపూర్, గోవిందారం, మేడిపల్లి, జగిత్యాల, మెట్‌పల్లి, కంట్లకుంట గ్రామాలకు చెందిన 32 మందికి ఆపరేషన్లు చేసి బుధవారం గ్రామానికి పంపించారు. ఈ కార్యక్రమంలో జిర్ఫ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్, మాజీ సర్పంచ్ అంగడి ఆనందం పాల్గొన్నారు.

బ్రిడ్జి మరమ్మతులు చేపట్టాలి

-మాజీ మంత్రి జీవన్ రెడ్డి

రాయికల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెడిపోయిన రోడ్లు, బ్రిడ్జిల మరమ్మతులను వెంటనే చేపట్టాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అధికారులను కోరారు. రాయికల్ మండలంలోని రాజ్‌నగర్ గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు చెడిపోయిన రోడ్లను పరిశీలించారు. పని చేయనివారి కాంట్రాక్ట్ క్యాన్సిల్ చేసి వేరేవారితో రాజ్‌నగర్, మండలంలోని మూటపెల్లి, వస్తాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో చెడిపోయిన రోడ్లను, బ్రిడ్జిలను వెంటనే పూర్తి చేయించాలని అధికారులకు తెలిపారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు మహేందర్ గౌడ్, మండ రమేష్, కొయ్యడి మహిపాల్ రెడ్డి, జగదీష్, రాజేశ్వర్ రెడ్డి, శ్రీను, రవి, రంజిత్, రాజేష్, లక్ష్మీనారాయణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం

● జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



చెరువు తూమును పరిశీలిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు తట్టెడు మట్టి చెరువుల్లో నుంచి తీయలేదని ఆమె ఆరోపించారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల గ్రామంలోని చెరువును గురువారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువులోని తూములో బండలు, ఇసుకలతో మట్టి నిండిపోయి తూము ప్రమాదకరంగా మారిందన్నారు. దీంతో చెరువులోని నీరు భారీగా వెనకకు ప్రవహించి వెనుకవైపు ఉన్న పొలాలు మునిగిపోతున్నాయన్నారు. రైతులు నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. వెంటనే తూముకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని అధికారులను వసంత ఫోన్ ద్వారా కోరారు. ఈకార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రూరల్ మండల అధ్యక్షుడు ఆనంద్‌రావు, నాయకులు మహేష్, శీను, లింగన్న, బాలకృష్ణ, పవన్, రవి, చందు, బాలు, మల్లేశం, అశోక్, గంగారాజం, లక్ష్మన్, నరేష్, శ్రీకాంత్, శాంతక్క, రైతులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

● రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం రాగి జావ మేలు చేస్తుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బెల్లంతో కూడిన రాగి జావ ఉదయపు పోషణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్, తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 16.2 లక్షల మంది విద్యార్థులకు రాగా జావ అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో 40 శాతం ఖర్చును ప్రభుత్వం, 60 శాతం ఖర్చును ట్రస్ట్ భరిస్తోందని ఆయన వివరించారు. జగిత్యాల జిల్లాలోనే



విద్యార్థికి రాగి జావ పంపిణీ చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

50 వేల మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఈ పానీయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్‌డీవో మదుసూధన్, జిల్లా విద్యాధికారి రాము, మండల తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, ఎంఈవో సీతాలక్ష్మి, ఎఫ్‌ఆర్‌వో శ్రీనాథ్, డిప్యూటీ రేంజి ఆఫీసర్ సదాశివుడు, అన్నపూర్ణ ట్రస్ట్ అసిస్టెంట్ రీజినల్ మేనేజర్ వీవీఆర్‌కే శాస్త్రి, రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ మెంబర్ నరేష్, మహదేవ్, జిల్లా ఉపాధ్యాయుల ప్రతినిధి కొమురయ్య, టీచర్ రిప్రజెంటేటివ్ దశరథ్‌రెడ్డి, ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి, మాజీ ఎంపీటీసీ సీపతి సత్యనారాయణ, టీచర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో సాగు వివరాలు నమోదు చేయాలి

● జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ సత్యప్రసాద్

6

యూరియా కోసం రైతుల రాస్తారోకో

గొల్లపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో గురువారం యూరియా కోసం రైతులు రాస్తారోకో చేశారు. గురువారం ఉదయం నుంచి గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం దగ్గర రైతులు యూరియా కోసం గంటల తరబడి క్యూలో నిల్చున్నారు. అనంతరం యూరియా బస్తాలు రాలేదని సిబ్బంది చెప్పడంతో రైతులు తీవ్ర ఆగ్రహం చెందారు. అన్నదాతలు నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు యూరియా బస్తాలను ఇవ్వడం లేదని, కేవలం బడా రైతులకే యూరియా బస్తాలను సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. గొల్లపల్లి ఏవో బొట్ల కరుణ రైతులతో మాట్లాడి యూరియా రాగానే సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కట్ట మహేష్, మండల శాఖ అధ్యక్షులు చెవులమద్ది శేఖర్, పట్టణ శాఖ అధ్యక్షులు సంగెం కళ్యాణ్, రైతులు పాల్గొన్నారు.



గొల్లపల్లిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

మహిళా అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులో గల తెలంగాణ సాంఘికసంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న మహిళ అధ్యా పకురాలకోసం దరఖాస్తులను ఆహ్వానిస్తు న్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గునుక శ్రీలత తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలో బోధించుటకోసం ఇంగ్లీష్, కామర్స్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన వారిని డెమో, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తామని ఆసక్తిగల మహిళ అభ్యర్థులు ఈనెల 6వ తేదీన ఉదయం 10గంటలకు నేరుగా తిమ్మాపూర్ శివారులోగల ఏబీ కన్వెన్షన్ ప్రక్కన గల కళాశాలలో హాజరు కావాలని కోరారు. సెట్, నెట్ అర్హత గల వారికి ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రాము

● జిల్లా విద్యాధికారి రాము

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూతనందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. జగిత్యాల పట్టణంలోని స్థానిక పురాణిపేట ప్రభుత్వ పాఠశాలలో దాతలైన పబ్బ శ్రీనివాస్, సురేష్, రేపల్లె హరికృష్ణ, గర్రెపల్లి సంపత్, సహకారంతో విద్యార్థులకు అందించిన ఇంగ్లీషు లెర్నింగ్ పుస్తకాలు, నోట్‌బుక్‌లు, ఐడీ కార్డులను అందించగా, మరోదాత శ్రీధర గణపతి శర్మ పాఠశాలకు అవసరమైన రూ.లక్ష విలువ గల సీసీ కెమెరాలను అందించి పాఠశాలలో బిగించారు. కాగా దాతలను డీఈవో రాము చేతుల మీదుగా శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో రాము మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. వీటితో పాటు డిజిటల్ ఎడ్యుకేషన్ ద్వారా విద్య అందుతున్నట్లు తెలిపారు. శ్రద్ధతో నేర్చుకునే విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుంచి ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలన్నారు. కొందరు విద్యార్థులకు దాతల సహకారం వారి జీవితాలను మలుపు తిప్పుతుందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, సన్మార్గంలో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు పబ్బ శ్రీనివాస్, గర్రెపల్లి సంపత్, సురేష్, స్కూల్ హెచ్‌ఎం తిరుపతి, ఉపాధ్యాయులు కృష్ణయ్య, రామ కృష్ణ, ప్రభాకర్, మురళి, చంద్రశేఖర్, రమణచారి, మంజుల, విజయలక్ష్మీ, కవిత, పద్మ తదితరులున్నారు. సెప్టెంబరు 5ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సెలవు ఉన్నందున డీఈవో చేతులమీదుగా ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించగా, అనంతరం పాఠశాల పక్షాన డీఈవో రామును శాలువాతో సత్కరించారు.

మెట్‌పల్లి డీఎల్పీవోగా ఎండి సలీం

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న మహమ్మద్ సలీంను డివిజనల్ పంచాయతీ అధికారిగా నియమిస్తు డిపిఓ మదన్‌మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రంకు సంబంధిచిన ఉత్తర్వులను ఆయన గురువారం అందజేశారు. ఆయన నియమకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

మల్లాపూర్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండలంలోని రత్నాపూర్ గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన వికాలగుండ్లైన మిత్రుడు కారుక సాగర్ కుటుంబానికి తోటి మిత్రులు నిత్యావసర సరుకులు అందజేశారు. గ్రామంలోని సాగర్ తల్లి ఇటీవల మృతి చెందడంతో గురువారం ఇంటికి వెళ్లి బియ్యంతో పాటు పప్పులు, నూనె, నిత్యావసర సరుకులను 7వ తరగతి మిత్రులు అందజేశారు. నిత్యావసర సరుకులు అందజేసిన వారిలో మిత్రులు మేడి వినోద్‌కుమార్, జార్ల సాగర్, దేవ శ్రీను, లక్ష్మణ్, సత్తె గంగు, లింగమని, స్రవంతి, నాయకులు కరూక మల్లయ్య, కూసనపెల్లి మల్లయ్య తదితరులు ఉన్నారు.

వినాయక నిమజ్జనానికి సర్వం సిద్ధం

● చింతకుంట చెరువు వద్ద ఏర్పాట్లు పూర్తి



ధర్మపురి గోదావరి వద్ద నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్



జగిత్యాల పట్టణంలో సిద్ధం చేస్తున్న నాటు తెప్పెలు, పడవలు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :వినాయక నిమజ్జన వేడుకలకు జిల్లాలోని చెరువులు, కుంటల వద్ద అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పెల్లి, ధర్మపురి, రాయికల్‌తో పాటు అన్ని మండలాల్లో వినాయక నిమజ్జన వేడుకల సందర్భంగా చెరువులు, కుంటల పరిశర ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దారు. ప్రధాన కూడళ్ల వద్ద విద్యుత్ దీపాలను అలంకరించారు.

●జిల్లా కేంద్రంలో వినాయక నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు బల్దియా అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. వేడుకల నిర్వాహణ కోసం రూ.25 లక్షల నిధులను కేటాయించారు. చింతకుంట చెరువుతో పాటు టవర్, ప్రధాన కూడళ్ల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ నుండి టవర్, పాత బస్టాండ్ నుండి టవర్ మీదుగా చింతకుంట చెరువు వద్దకు వినాయకుల శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేలా రహదారులపై ఉన్న గుంతలను మట్టి, కాంక్రీట్‌తో చదును చేశారు. చెరువు వద్ద ప్రమాదాలు జరుగకుండా భారీకేడ్లను నిర్మించారు. నిమజ్జనం నిర్వహించే చింతకుంట చెరువు వద్ద 10 భారీ క్రేన్‌లతో పాటు, 12 నాటు తెప్పెలను, 25మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

భారీ బందోబస్తు..

జిల్లా వ్యాప్తంగా శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్న నిమజ్జన వేడుకలకు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలతో పాటు సివిల్ పోలీసుల నిఘా ఉంటుందని నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా యువత భక్తిశ్రద్ధలతో నిమజ్జనవేడుకలను జరుపుకోవాలన్నారు.

●టవర్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు...

వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని టవర్ వద్ద అధికారులతో పాటు విశ్వహిందూ పరిషత్ నాయకులు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రశాంతంగా జరిగేలా చర్యలు

●ధర్మపురి: వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని గోదావరి నది వద్ద వినాయక నిమజ్జన ప్రాంతాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ఠ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన పేర్కొన్నారు. రద్దీని నియంత్రిం చడం, ప్రజల భద్రత వంటి అంశాలపై దృష్టి సారించాలని ఆయన తెలిపారు. ఆయన వెంట జగిత్యాల ఆర్‌డీవో మదుసూధన్, ధర్మపురి మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్‌రావు, మండల తహసీల్దార్ శ్రీనివాస్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ చిట్యాల గంగాధర్ పాల్గొన్నారు.

మావోయిస్టులు గోపగాని ఐలన్న, కుమారస్వామిల తల్లి మృతి


కొమరమ్మ(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు గోపగాని ఐలన్న, కుమరస్వామిల తల్లి గోపగాని కొమరమ్మ(92) మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో గురువారం ఉదయం మృతి చెందారు. గోపగాని కొమరమ్మకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె కాగా ఇద్దరు కుమారులు గోపగాని ఐలన్న, గోపగాని కుమరస్వామిలు నాటి పీపుల్స్‌వార్ పార్టీలో క్రియాశీల కంగా పనిచేశారు. గోపగాని కుమారస్వామి 1979లో కమలాపూర్ మండలం గూడూరులో ఏర్పడిన తొలి దళంలో సభ్యుడిగా చేరారు. దళంలో పనిచేస్తున్న సమయంలోనే గ్రెనేడ్ ప్రమాదంలో మృతిచెందగా మరో కుమారుడు ఐలన్న పీపుల్స్ వార్ పార్టీకి ఉత్తర తెలంగాణరీజనల్ కార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలో కిడ్నాప్‌నకు గురయ్యాడు. 37ఏళ్లు దాటినా ఆచూకీ లభించడం లేదు. కిడ్నాప్ కలకలం అప్పట్లో సంచలనం సృష్టించగా పలువురు రాజకీయ ప్రముఖులు ఈ ఘటనపై నిరసన వ్యక్తం చేశారు. కాగా కుమారుడి ఆచూకీ కోసం ఎదురు చూసిన తల్లికి చివరికి నిరాశే మిగిలి మృతిచెందింది. కొమురమ్మ మృతిపట్ల పలువురు ప్రముఖులు, ప్రజలు నివాళులర్పించారు.

ఐదు రోజుల క్రితం..

ఇంట్లో నుంచి వెళ్లి శవమై తేలాడు

● పురుగుల మందు తాగి బలవన్మరణం చెందిన గొర్రెల కాపరి


రాజయ్య(ఫైల్)

గొల్లపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం దట్నూర్ గ్రామానికి చెందిన జక్కుల రాజయ్య(50) అనే గొర్రెల కాపరి గత ఆదివారం ఇంట్లో నుంచి వెళ్లి ఐదురోజుల అనంతరం గ్రామరెవెన్యూ పరిధిలోని చింతామణి కుంట సమీపంలో గురువారం శవమై తేలాడు. దీంతో బాధిత కుటుంబంలో తీరని విషాదం అలుముకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజయ్య గ్రామంలో గొర్రెల కాపరిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎప్పటి మాదిరిగానే ఆదివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. బయటికి వెళ్లిన వ్యక్తి రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది చుట్టు పక్కల అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. అయితే, గతంలో ఒకట్రెండు సార్లు ఇలాగే ఇంట్లో ఎవరికీ చెప్పాపెట్టకుండా వెళ్లివచ్చాడు. ఎప్పటిలాగే తిరిగి వస్తాడనుకుని అతడి రాకకోసం ఎదిరిచూస్తున్నారు. ఈ క్రమంలో గురు వారం గొర్రెల కాపరులు గొర్రెల మందను తోలుకుంటూ చింతామణి కుంట వైపు వెళ్లగా దుర్వాసన రావడంతో దగ్గరికెళ్లి చూడగా రాజయ్య మృతదేహం కనిపించింది. దీంతో వారు బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలికి వెళ్లి కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించి వివరాలు సేకరించారు. అయితే, శవం పక్కనే పురుగుల మందు డబ్బా ఉండడాన్ని గుర్తించిన పోలీసులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా అనుమానిస్తున్నారు. తన భర్త కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు న్నాడని, ఆరోగ్యం నయం కాకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య శంకరవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వెంకటాపూర్‌లో చోరీ

● కేసు నమోదు ● కత్తులు అపహరించిన దొంగలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో రెండు దుకాణాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి గురువారం తెలిపారు. చికెన్ సెంటర్ లోని కత్తులను ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని సల్వాజీ వెంకట్ స్థానికంగా చికెన్‌సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. దుకాణం తాళం పగులకొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు రూ.2వేల విలువైన నాలుగు కత్తులను ఎత్తుకెళ్లారు. అక్కడనుంచి బస్టాండు ప్రాంతం లోని ముత్యం రాజుకు చెందిన కిరాణ దుకాణంలో చోరీకి విఫలయత్నం చేశారు. దుకాణం షటరును పైకి ఎత్తేందుకు ప్రయత్నించారు. శబ్దం వినిపించడంతో దుకాణం వెనుకాల కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తున్న రాజు మేల్కొని కేకలు వేయడంతో దొంగలు పారిపోయారు. బాధితుడు సల్వాజీ వెంకట్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

పత్తి రైతుల కోసం కపాస్ కిసాన్

● కొనుగోళ్ల కోసం ప్రత్యేక యాప్ ● ఏర్పాటు చేసిన సీసీఐ



చొప్పదండి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతుల కోసం సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కపాస్ కిసాన్ అనే ప్రత్యేక యాప్‌ను తీసుకు వచ్చింది. ఇకపై సీసీఐ పత్తి కొనుగోళ్లను యాప్ ద్వారానే చేపట్టనుంది. గత సోమవారం నుంచి రైతులకు యాప్ అందుబాటులోకి రాగా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల నుంచి మాత్రమే సీసీఐ పత్తి కొనుగోళ్లు చేస్తున్నది. సెప్టెంబరు 30లోగా కపాస్ కిసాన్ యాప్ లో రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలి. రైతు రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే పత్తిని సీసీఐకి విక్రయించే అవకాశం ఉంటుంది. తద్వారా రైతుకు మద్దతు ధర లభిస్తుంది. దేశవ్యాప్తంగా సీసీఐ యాప్ ద్వారానే పత్తి కొనుగోలు చేసేందుకు 2025-26 సంవత్సరానికి సంబంధించి యాప్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. పత్తికి కనీస మద్దతు ధర క్వింటాలుకు 8,110 రూపాయలు ప్రకటించగా మద్దతు ధర పొందాలంటే రైతులు తప్పనిసరిగా కపాస్ కిసాన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.



30 లోగా నమోదు చేసుకోవాలి...

పత్తి సాగు చేసిన రైతులు ఈ నెల 30 లోగా కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలి. గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. పట్టాదారు పాస్‌పుస్తకంతోపాటు పత్తి సాగు చేసిన భూమి సర్వే నంబర్, ఆధార్ నంబర్‌తోపాటు ఇతర వివరాలను అందులో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. రెవెన్యూ అధికారుల నుంచి పత్తి పంట ధ్రువీకరణ పత్రం, గ్రామం, మండలం, జిల్లా వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. సాగు చేసిన విస్తీర్ణంతోపాటు ఇతర వివరాలను నమోదు చేయగానే సీసీఐకి వివరాలు చేరిపోతాయి.

ఎక్కడ ఎంత విస్తీర్ణం సాగుచేశారనే గణాంకాలు సీసీఐకి తెలిసి పోతాయి. వీటి ఆధారంగా సీసీఐ పత్తి కొనుగోళ్లను చేపడుతుంది. రైతులకు కనీస మద్దతు ధర అందుతుంది.

స్లాట్ బుకింగ్‌తో కొనుగోళ్లు...

కపాస్ కిసాన్ యాప్‌లో రిజిస్టర్ అయిన రైతులు పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. రైతులు ఎంచుకున్న మార్కెట్ యార్డుకు సంబంధించి పత్తిని విక్రయించేందుకు రైతులు ముందుగానే స్లాట్ బుక్ చేసుకోవాలి. ఏ రోజున సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తిని విక్రయించాలో వివరాలను యాప్ లో రైతుకు సమాచారం అందుతుంది. స్లాట్ బుక్ అయిన రోజు మాత్రమే రైతులు పత్తిని విక్రయించాల్సి ఉంటుంది.

రైతులు రోజుల తరబడి సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తిరగాల్సిన పనిలేకుండా స్లాట్ బుకింగ్‌తో సూచించిన రోజునే విక్రయించుకునే అవకాశం ఏర్పడుతుంది. ఫలితంగా దళారులకు చెక్ పెట్టే అవకాశం ఏర్పడుతుందని, రైతులకు మద్దతు ధర దొరుకుతుందని అధికారులు చెబుతున్నారు. వచ్చే నెల పత్తి పంట చేతికి అవకాశం ఉండగా రైతులు ఈ నెలాఖరులోగానే కపాస్ కిసాన్ యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీల సీజ్

ముత్తారం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం మీదుగా అక్రమంగా మట్టిని తరలిస్తున్నలారీలను అధికారులు గురువారం సీజ్‌చేశారు. నేషనల్ హైవేరోడ్డు పనులకు కావలసిన మట్టిని అనుమతులు లేకుండా 15రోజులుగా తరలిస్తున్నారు. స్థానికులకు అనుమానం వచ్చి అనుమతులు ఉన్నాయాఅని అడగగా సూపర్‌వైజర్లు బెదిరింపులకు గురిచేశారు. స్థానికులు మైనింగ్‌శాఖ అధికారులకు ఫిర్యాదుచేయగా గురువారం అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీలను పట్టుకొని ముత్తారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పారుపల్లి గ్రామం పక్కన ఉన్న గుట్టనుంచి అనుమతులు లేకుండా తవ్వకాలుజరిపిమట్టిని తరలిస్తున్నారు. మైనింగ్ అధికారులు 3లారీలనుపట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి వాటిని సీజ్ చేశారు.

నేడు కరీంనగర్‌లో ట్రాఫిక్ మళ్లింపు

● నిబంధనలు పాటించి సహకరించాలి
● పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గణేష్ నిమజ్జనం సందర్భంగా శుక్రవారం కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం ప్రకటించారు. ప్రజలు. వాహనదారులు ఈ మళ్లింపులకు సహకరించి ప్రయాణ సౌలభ్యాన్ని పాటించాల్సిందిగా కోరారు.

● మానకొండూర్ నుంచి..

- హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వచ్చే వాహనాలు మానకొండూర్ పల్లె బస్టాండ్‌వద్ద నుంచి ముంజంపల్లి, పోరండ్ల వైపు మళ్లిస్తారు. ఆ తర్వాత తిమ్మాపూర్ వద్ద రాజీవ్ రోడ్డుకు చేరుకుని, అక్కడి నుంచి కరీంనగర్‌కు వెళ్లవచ్చు.

- నిమజ్జనం తర్వాత తిరిగి వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో అంటే ముంజంపల్లి, పోరండ్ల మీదుగా తిమ్మాపూర్‌కు చేరుకుని, అక్కడి నుంచి కరీంనగర్‌కు వెళ్లాలి.

- కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు ఎలాంటి మళ్లింపులు ఉండవు. అవి యథావిధిగా తమ మార్గంలో ప్రయాణించవచ్చు.

● కొత్తపల్లి నుంచి..

- జగిత్యాల నుంచి కరీంనగర్ వైపు వచ్చే వాహనాలను వెలిచాల ఎక్స్ రోడ్డు వద్ద మల్కాపూర్, చింతకుంట, పద్మనగర్ ఎక్స్ రోడ్డు, ఎన్టీఆర్ విగ్రహం మీదుగా సిరిసిల్ల బైపాస్ రోడ్డు నుంచి కరీంనగర్ పట్టణానికి మళ్లిస్తారు.

- కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్లే వాహనాలకు అవసరమైనప్పుడు రేకుర్తి జంక్షన్ వద్ద యూనివర్సిటీ ఎక్స్‌రోడ్డు, మల్కాపూర్ వైపు మళ్లించి, వెలిచల ఎక్స్ రోడ్డు వద్ద జగిత్యాల రోడ్డుకు చేరుకుంటారు.

● నిమజ్జనం పాయింట్ల వద్ద..

- చింతకుంట, కొత్తపల్లిలలో నిమజ్జనం తర్వాత, ఈ పాయింట్ల వద్దకు వచ్చిన వాహనాలు యూటర్న్ తీసుకుని అదే మార్గంలో కరీంనగర్‌కు తిరిగి వెళ్లాలి.

సెప్టెంబర్ 5వ తేదీ నుంచి 6వ తేదీ వరకు గ్రానైట్, ఇతర భారీ సరుకు రవాణా వాహనాలను ఈ మార్గాలలో అనుమతించరు. ఈ నిబంధనలను తప్పక పాటించాలని

వృద్ధురాలి పోషణను పట్టించుకోని కుమారుడు

● ఇల్లు విడిచి వెళ్లిన తల్లి
● సఖి కార్యాలయానికి తరలించిన అధికారులు

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలైన తల్లి పోషణను కుమారుడు పట్టించుకోకపోవడంతో ఆమె ఇంటిని వదిలి బయటకువెళ్లింది. వినాయక మండపాలవద్ద తింటూ చెట్లకింద సేదతీరుతున్న వృద్ధురాలిని గురువారం స్థానికులు గమనించి జిల్లా సంక్షేమాధికారికి బొనగిరి నరేష్‌కు సమాచారం అందించారు. దీంతో ఫీల్డ్‌రెస్పాన్స్ అధికారి కొండయ్యను పంపించి జిల్లా కేంద్రంలోని సఖి కార్యాలయానికి వృద్ధురాలిని పంపించారు. బాధితురాలి కథనం ప్రకారం.. జగిత్యాల మండలం ధరూర్ గ్రామానికి చెందిన నాకుమల్ల కిష్టమ్మ అనే వృద్ధురాలు తనకున్న ఇంటిని తనకుమారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేసింది. కొన్ని రోజులుగా కొడుకు, కోడలు సరిగా చూసుకోకపోవడంతో ఆరురోజుల క్రితం ఇంటిని వదిలివచ్చింది. వృద్ధురాలు జగిత్యాల విద్యానగర్‌లో ఉన్న రామాలయం వద్ద గణపతి మండలం వద్ద తింటు అక్కడే ఉండడంతో గమనించిన స్థానికులు జిల్లా సంక్షేమాధికారికి సమాచారం అందించారు. తన కుమారుడు, కోడలు తనను తిట్టికొట్టి ఇంట్లోనుంచి వెళ్లగొట్టారని, ఎలాగైనా తన పోషణ బాధ్యత కొడుకు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమాధికారికి ఇచ్చినఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోల్‌సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గాంధీనగర్ వంకబెండు సమీపంలోని ఒకఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై గురువారంవన్‌టౌన్ పోలీసులు దాడి చేశారు. 7గురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని రూ.11,840నగదు, ఏడు సెల్‌ఫోన్లను సీజ్‌చేశారు.

బావిలో పడి వృద్ధురాలు మృతి

తిమ్మాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో ఓ వృద్ధురాలు బావిలో పడి మృతిచెందింది. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. ఇందిరానగర్‌కు చెందిన అలువల లచ్చమ్మ (80)కు మతిస్థిమితం సరిగాలేదు. గురువారం ఇంట్లో నుంచి వెళ్లిన ఆమే బతుకమ్మకుంటవద్ద గల బావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. దీనిపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎల్ఎండీ పోలీసులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

● బాధితురాలికి రూ.ఐదు లక్షలు పరిహారం చెల్లింపునకు లీగల్ సెల్ అథారిటీకి సిఫారసు

ఓదెల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు శీలారపు రమేష్‌కు గురువారం యావజ్జీవ శిక్షతోపాటు రూ.21వేలు జరిమానా విధిస్తూ పెద్దపల్లికోర్టు జడ్జి కె సునీత తీర్పునిచ్చారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఫిర్యాదుదారుడి మనుమరాలుమూడేళ్లక్రితం వేసవిసెలవుల్లో తాత ఇంటికి వచ్చింది. అమ్మమ్మ,తాత ఉపాధి హామీ పనికి వెళ్లగా పక్కఇంటి పిల్లలతో ఆడుకుంటోంది. ఇంటిసమీపంలో ఉన్న శీలారపు రమేష్ బాలికను అన్నం తినమని అతడి ఇంటిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడి పరారయ్యాడు. తీవ్రరక్తస్రావం అవుతున్న బాలిక ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చిన అమ్మమ్మ, తాతకు జరిగినవిషయం చెప్పింది. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ నిందితుడిపై పోక్సో కేసు నమోదుచేశారు. ఏసీపీ సారంగపాణి కేసును పరిశీలించి మహిళా ఎస్‌ఐ మౌనికతో బాధితురాలి వాంగ్మూలాన్ని రికార్డు చేయించారు. అనంతరం నిందితుడి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మూడేళ్లపాటు పెద్దపల్లి ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేకకోర్టులో విచారణ కొనసాగింది. వాదోపవాదాలు విన్న అనంతరం రమేష్‌పై నేరం రుజువుకావడంతో జడ్జి కె సునీత ముద్దాయికి యావజ్జీవ కఠినకారాగార శిక్షతోపాటు రూ.21వేలు జరిమానా విధించారు. బాధితురాలికి రూ.5 లక్షలు పరిహారంగాచెల్లించాలని జిల్లా లీగల్ సెల్ అథారిటీకి సిఫారసుచేశారు. కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాదం రమేష్ కీలకపాత్ర వహించారు. డీసీపీ కరుణాకర్, ఏసీపిగజ్జికృష్ణ పర్యవేక్షణలో సాక్ష్యులను ప్రవేశపెట్టి, నిందితుడికి శిక్షపడేలాకృషి చేసిన సీఐసుబ్బారెడ్డి, ఎస్సై దీకొండరమేష్, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్‌ప్రాసిక్యూషన్ బృందాన్ని రామగుండం సీపీ అభినందించారు.

ఎదురెదురుగా ఢీకొన్న కారు, ట్రాక్టర్

● కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన కారు

శంకరపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కారు.. ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డ సంఘటన శంకరపట్నం మండలం కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి దేవాలయ సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా గోపాలపూర్ గ్రామానికి చెందిన తీగల రాజేందర్, తీగల శ్రీనివాస్ కారులో కరీంనగర్ నుంచి హనుమకొండకు వెళ్తున్నారు. ఈ క్రమంలో హుజూరాబాద్ వైపు నుంచి కేశవపట్నం వైపు వస్తున్న ట్రాక్టర్ కరీంనగర్-వరంగల్ జాతీయరహదారిపై కొత్తగట్టు శివారులో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో కారు ముందు భాగం ధ్వంసమైంది. కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో అందులోని వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు108లో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయంతెలుసుకున్న కేశవపట్నం పోలీసులు సంఘటనస్థలానికి చేరుకొని ప్రమాదానికి సంబంధించిన వివరాలు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

ఇసుక డంపుల స్వాధీనం


పట్టుకున్న ఇసుకను లారీలో తరలిస్తున్న అధికారులు

కథలాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని బొమ్మెన పెద్దవాగు శివారులో అక్రమంగా నిల్వఉంచిన ఇసుకడంపులను గురువారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొందరు వ్యక్తులు కొద్దిరోజులుగా ఆ ప్రాంతంలో ఇసుకను నిల్వచేసి టిప్పర్లతో ఇతర ప్రాంతాలకు విక్రయిస్తున్నారని అధికారులకు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. 32ట్రిప్పుల ఇసుకను స్వాధీనం చేసుకుని సూరమ్మచెరువు కాంట్రాక్టర్‌కు వేలంద్వారా విక్రయించామని ఎస్సై నవీన్‌కుమార్, ఆర్ఐనగేశ్ తెలిపారు. తక్కళ్ళపల్లి వాగు పరిసరాల్లో నిల్వఉంచిన 12ట్రిప్పుల ఇసుకనుకూడా వేలంవేసి విక్రయించినట్లు తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లి చెరువులో వ్యక్తి గల్లంతు


అనిల్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన దబ్బెట అనిల్(31) బంధువుల అంత్యక్రియలకు వెళ్లి స్థానిక గిద్ద చెరువులో స్నానం చేస్తూ గల్లంతైన ఘటన గురువారం చోటు చేసుకుంది. దబ్బెట రాధ ఇటీవల కరీంనగర్‌లో రోడ్డుప్రమాదంలో మృతి చెందింది. కుటుంబసభ్యులు స్వగ్రామమైన పందిల్లలో అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం చెరువులో స్నానం చేస్తున్న క్రమంలో అనిల్ గల్లంతయ్యాడు. తహసీల్దార్ జగదీశ్వర్‌రావు, ఎస్‌ఐ అనిల్‌కుమార్ ఆధ్వ ర్యంలో జాలర్లు చెరువులో పడవల ద్వారా గాలింపు చేపట్టారు. చీకటి కావడంతో గాలింపును నిలిపివేశారు. అనిల్‌కు భార్య ఉమా, కూతుళ్లు అన్విత, వినూత్న, తండ్రి రాజయ్య ఉన్నారు.

అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం


ధ్వంసమైన మొక్కజొన్న పంట

కథలాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండ్ర్యాలలో బుధవారం రాత్రి అడవిపందులు దాడి చేయడంతో సుమారు ఐదెకరాల మొక్కజొన్న పంట ధ్వంసమైంది. నాలుగు నెలలు పంటను కాపాడుకుని చేతికొచ్చే దశలో ఉండగా అడవి పందులు పంటను నాశనం చేశాయని బాధితరైతులు మిట్టపల్లి గంగారెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మరికొద్ది రోజుల్లో పంటను కోసుకునేందుకు సిద్ధమవుతుండగా పందుల వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

బాబోయ్ కుక్కలు

● చిన్నారులు, వృద్ధులపై దాడులు


రాయికల్‌లో తిరుగుతున్న వీధి కుక్కలు

రాయికల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మున్సిపాలిటీలో కుక్కల దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయి. పట్టణంలో 12వార్డులు ఉండగా, సుమారు వెయ్యికుక్కల వరకు తిరుగుతున్నాయి. ఎక్కడ చూసినా గుంపుగుంపులుగా కుక్కలు ఉండటంతో చిన్నారులు ఆరుబయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. బల్దియాలో కుక్కలను నియంత్రించేవారు లేరు. పశువైద్యాధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని కుక్కలు అంతుచిక్కని రోగంతో కనిపిస్తున్నాయి. కొన్ని కుక్కలు చర్మం ఊడిపోయి గజ్జి సోకినట్లు ఉంటున్నాయి. ఈ కుక్కలు ఎవరినైనా కరిస్తే తీవ్ర దుష్పరిణామాలు ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించేలా చర్యలు చేపట్టాలని, పశు వైద్యాధికారులు కుక్కలకు వ్యాక్సినేషన్ చేయాలని కోరుతున్నారు.

● పట్టణాల్లో పెరుగుతున్న కేసులు

గ్రామాలతో పోల్చుకుంటే 80శాతం కేసులు పట్టణంలోనే నమోదవుతున్నాయి. యానిమల్‌బర్త్ కంట్రోల్, జంతుసంరక్షణ బోర్డుఆఫ్‌ఇండియా నిబంధనల ప్రకారం వీధి కుక్కల సంఖ్య అదుపునకు శస్త్ర చికిత్సలు చేయాలన్నారు

● కుక్కలు దాడి చేస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు

✔ కుక్కలు కరిచిన ప్రదేశంలో మంచి నీరు, సబ్బుతో ఐదు నిమిషాలు పరిశుభ్రంగా కడగాలి. వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

✔ స్వల్పగాయాలకు (గీతలకు) మూడు డోసుల వ్యాక్సిన్ తీసుకోవాలి.

✔ రక్తస్రావమైన గాయాలకు నాలుగు డోస్‌ల వ్యాక్సిన్ తప్పనిసరిగా తీసుకోవాలి.

✔ కుక్కలు కరిచిన రోజు మొదటి డోస్, 3వ రోజు రెండో డోస్, 7వరోజు మూడోడోస్, 21వ రోజు నాలుడోడోస్ తీసుకోవాల్సి ఉంటుంది.

✔ తల భాగంలో ఎలాంటి జంతువులు గాయపరిచినా నాలుగు డోస్‌ల వ్యాక్సిన్ తప్పనిసరిగా తీసుకోవాలి.

✔ యాంటీరేబిస్ వ్యాక్సిన్ చేయించుకుని తగిన చికిత్స పొందాలి. ఆలస్యం, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాల మీదకు వస్తుంది.

✔ ప్రధానంగా ఇళ్లలోని పెంపుడుకుక్కలకు వ్యాక్సిన్ క్రమం తప్పకుండా వేయించాలి.

● నియంత్రణ చర్యలు తీసుకుంటాం..

మనోహర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్



నీళ్లు, ఆహారం దొరకక వీధి కుక్కలు దాడిగి దిగుతుంటాయి. యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను సంప్రదించి సంతతి పెరగకుండా చర్యలు తీసుకుంటాం. కుక్కల దాడిపై ఉన్నతాధికారులకు నివేదించి వాటి బెడద తగ్గించేందుకు కృషి చేస్తాం.

గుంతలమయంగా లో లెవల్ వంతెన

● ఇబ్బందుల్లో వాహనదారులు ● పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు


బురదమయంగా మారిన లోలెవల్ వంతెన

సైదాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్-హుజూరాబాద్ ప్రధానరహదారిలో సైదాపూర్ సమీపంలో గల లో లెవల్ వంతెన పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ప్రయాణం చేసేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు. ఒకవైపు పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అందులో బురద పేరుకపోవడంతో వాహనాలు ఒకవైపు నుంచే వెళ్తున్నాయి. ఒక వైపు నుంచి వాహనాలు వెళ్లేవరకు ఇంకోవైపు వాహనాలు అక్కడే నిలపాల్సి వస్తోంది. గుంతల్లో టైర్లు పడి ఇబ్బంది అవుతోందని వాహనదారులు గుంతలున్న వైపు వెళ్లడం లేదు. ఇది ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. వర్షాలు ఎక్కువగా పడితే న్యాల చెరువు మత్తడి పడి రోడ్డుపై నుంచి నీరు ప్రవహించే అవకాశముంది. వర్షాలు ఎక్కువగా కురిసిన ప్రతీసారీ లోలెవల్ వంతెనలో నీరు పట్టక రోడ్డుపై నుంచి నీరు ప్రవహించి మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. చాలా సంవత్సరాలుగా ఈ లోలెవల్ వంతెనను తొలగించి హైలెవల్ వంతెన నిర్మాంచాలనే డిమాండ్ ఉంది. చాలాసార్లు అప్పటి ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు, ఇప్పటి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు స్థానిక ప్రజలు విన్నవించారు. అయినా ఇప్పటివరకు బ్రిడ్జి నిర్మించలేదు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి బ్రిడ్జి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


సైదాపూర్ వద్ద గుంతలమయంగా మారిన లోలెవల్ వంతెన

ఉమ్మడిజిల్లా జూనియర్‌కళాశాలల ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా గుమ్మడి మధుజాన్సన్



మధు జాన్సన్

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడికరీంనగర్ జిల్లా జూనియర్ కళాశాలల క్రీడాసమాఖ్య(ఎస్‌జీఎఫ్) కార్యదర్శి గుమ్మడి మధుజాన్సన్ నియమితులయ్యారు. ప్రభుత్వ ఆర్ట్స్‌అండ్‌కామర్స్ జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మధుజాన్సన్ 2025-26 సంవత్సరానికి క్రీడాసమాఖ్య కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వి గంగాధర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా మధుజాన్సన్‌ను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సత్యవర్ధన్‌రావు, వి ఆంజనేయరావు, వెంకటరమణాచారి, శశిధర్ శర్మ, ఎ నిర్మల, సుధాకర్, బల్బీర్‌సింగ్, కళాశాల అధ్యాపక బృందం, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి, ఒలంపిక్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అభినందించారు.

ప్రమాదకరంగా ఫైవింక్లయిన్ బస్‌షెల్టర్



శిథిలావస్తలో ప్రమాదకరంగా ఉన్న బస్‌షెల్టర్ పోల్

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందలసంఖ్యలో ప్రయాణికులు వేచిచూసే గోదావరిఖని ఫైవింక్లయిన్ వద్ద ఉన్న బస్‌షెల్టర్ కూలిపోయే దశకు చేరుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. సింగరేణి ఆధ్వర్యంలో ఫైవింక్లయిన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బస్‌షల్టర్‌లోని ఐరన్ పోల్స్ శిథిలమై విరిగిపోయే దశకు చేరుకున్నాయి. యాచకులకు నిలయంగా మారిన ఈ బస్‌షల్టర్‌ను ఇటీవల ఆంధ్రజ్యోతి కథనంతో కార్పొరేషన్ సిబ్బంది శుభ్రం చేశారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఈ బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరుకోవడం, వర్షాకాలం కావడంతో ప్రయాణికులు బస్సుల కోసం బస్‌షల్టర్ వేచి చూస్తుంటారు. ఐరన్‌పోల్స్ ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికులు ప్రాణలు అరచేతిలో పెట్టుకుని బస్సుల కోసం వేచిచూస్తున్నారు. అధికారులు నూతన బస్‌షెల్టర్‌ను నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇసుక లారీల పట్టివేత

గన్నేరువరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను గురువారం గుండ్లపల్లి స్టేజివద్ద పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై నరేందర్ రెడ్డి తెలిపారు. అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఈ సందర్భంగా హెచ్చరించారు.



హై లెవల్ బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యేదెన్నడో?

- రెండేళ్లుగా శిలాఫలకాలకే పరిమితం
- వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలంలో హైలెవల్ వంతెనల నిర్మాణాలకు శిలాఫలకాలు వేసి రెండేళ్ల గడుస్తున్నా పనులు ప్రారభం కావడం లేదు. దీంతో వర్షాకాలంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో నాయకులు ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయి. ఇబ్రహీంపట్నం నుంచి జిల్లా సరిహద్దు అయిన వర్షకొండ గ్రామం గుండా నిజామాబాదు జిల్లాకు వెళ్లే రహదారిపై రెండు లోలెవల్ వంతెనలు ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే వర్షపు నీరు వీటిపై నుంచి ప్రవహించి రాకపోకలు అంతరాయం ఏర్పడుతోంది. ఈ రెండు వంతెనల నిర్మాణానికి అప్పటి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు 2023లో రూ.4 కోట్లు మంజూరు చేయించి భూమి పూజ చేశారు. గుత్తేదారులు పనులు దక్కించుకొని వంతెన నిర్మాణానికి పక్కన అప్రోచ్ రోడ్డు కోసం పైపులు తెప్పించి వదిలేశారు. ప్రభుత్వాలు మారడంతో వంతెన నిర్మాణానికి నాయకులు, అధికారులు చొరవ చూపడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. భారీ వర్షాలు పడినప్పుడు వర్షకొండ పెద్ద చెరువు మత్తడి దూకి లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహించి రాకపోకలు నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. దీంతో మండల కేంద్రానికి రావడానికి ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి వంతెనల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎం.డీ ఫయిజాన్: ఏఈఈ, రోడ్లు భవనాల శాఖ

వర్షకొండ, ఇబ్రహీంపట్నం మధ్య గల రెండు వంతెనల నిర్మాణం కోసం పనులు దక్కించుకున్న గుత్తేదారులతో మాట్లాడి పనులు ప్రారంభయ్యేలా చూస్తాం.

పీహెచ్‌డీ గైడ్‌షిప్ కోసం ఎస్సారార్ అధ్యాపకుల దరఖాస్తు



ఎస్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్‌కు పీహెచ్‌డీ గైడ్ షిప్ కోసం దరఖాస్తులను సమర్పిస్తున్న ఎస్సారార్ అధ్యాపకులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ అటానమస్ కళాశాలకు చెందిన ఎనిమిది మంది అధ్యాపకులు పీహెచ్‌డీ గైడ్‌షిప్ కోసం శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్‌కు దర ఖాస్తు సమర్పించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆచార్యకల్వకుంట రామకృష్ణ తెలిపారు. కళాశాల తెలుగు విభాగం నుంచి ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, కామర్స్ విభాగం నుంచి డాక్టర్ ఎం మల్లారెడ్డి, డాక్టర్ హర్‌జ్యోత్‌కౌర్, డాక్టర్ బూర్ల నరేష్, డాక్టర్ కెఅర్జున్, వృక్షశాస్త్ర విభాగం నుంచి డాక్టర్ తిరు కోవెల శ్రీనివాస్, డాక్టర్ పడాల తిరుపతి వెరసి ఎనిమిది మంది అధ్యాపకుల దరఖాస్తులను యూనివర్సిటీకి సమర్పించినట్లు తెలిపారు. ఇటీవలే శాతవాహన యూనివర్సిటీ వారు కళాశాలలోని తెలుగు, కామర్స్, వృక్షశాస్త్ర విభాగాలను రీసెర్చ్‌సెంటర్లుగా గుర్తింపు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ నితిన్ పాఠక్, టి రాజయ్య, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, పరిశోధన కమిటీ సమన్వయకర్త డాక్టర్ ఎం మల్లారెడ్డి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి (52) అనే వృద్ధుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాలప్రకారం మహేందర్‌రెడ్డి ఎన్‌టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహించేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిస కావడంతో ఉద్యోగం నుంచి తొలగించారు. వారంరోజుల నుంచి అధి కంగా మద్యం సేవిస్తున్నాడని గురువారం ఉదయం అందుగులపల్లి రైల్వేగేట్ వద్ద గూడ్సు రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే జీఆర్‌పి కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద



కాకతీయ కాలువ ద్వారా దిగువకు వెలుతున్న నీరు

జగిత్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరదనీరు రావడం కొనసాగింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 1,25,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 23 గేట్లు పైకి ఎత్తి 1,00,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకు గాను ప్రస్తుతం 76.104 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయనికి (మిడ్‌మానేరు) ప్రాజెక్టు ఇన్‌ఫ్లో కొసాగుతోంది. ప్రాజెక్టులోకి గురువారం 15300క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా, ఇందులో ఎస్సారెస్పీ నుంచి వరదకాలువ ద్వారా 14000క్యూసెక్కులు మానేరు, మూలవాగు ద్వారా 1300క్యూసెక్కుల నీటిప్రవాహం కొనసాగుతోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టునుంచి దిగువఉన్న ఎల్ఎండీ ప్రాజెక్టుకు ఒకగేట్‌ద్వారా వెయ్యి క్యూసెక్కులు, ప్యాకేజి10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 12800 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318మీటర్లకు ప్రస్తుతం 317.44 ఉండగా, నీటి నిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 26.118 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ నీటితో కళకళలాడుతోంది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.75 టీఎంసీల నీరు ఉంది. సర్జిపూల్ ద్వారా నాలుగు పంపులతో 12800 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయక సాగర్‌కు 9900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కాకతీయ కాలువ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్ : కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నుంచి కాకతీయకాలువ ద్వారా దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. మిడ్‌మానేరు నుంచి 1000 క్యూసెక్కులు, ఎగువ కాకతీయకాలువ ద్వారా 1400 క్యూసెక్కులు మొత్తం 2400క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా 3వేల క్యూసెక్కులు దిగువకు, మిషన్ భగీరథ, ఆవిరిరూపంలో 305క్యూసెక్కులు మొత్తం 3305 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతోంది. ఎల్ఎండిలో ప్రస్తుతం 22.707టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

కొత్తపల్లి-హుస్నాబాద్ రహదారి నిర్మాణం కోసం చర్యలు చేపట్టాలి

● జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొత్తపల్లి-హుస్నాబాద్ నాలుగు వరుసల రహదారి నిర్మాణం వేగవంతం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు వరుసల రహదారి కోసం ఇప్పటికే మార్కింగ్ పూర్తయినందున ఎలక్ట్రికల్ వర్క్స్, బావుల పూడ్చివేత, చెట్లు కత్తిరించడం వంటి పనులు వేగవంతంగా చేయాలన్నారు. ఇప్పుడున్న రహదారిని వెడల్పు చేస్తున్నందున గ్రామాల గుండా వెళ్తున్న రహదారి నిర్మాణం కోసం గ్రామసభలు ఏర్పాటు చేసి తీర్మానం చేయాలని అన్నారు. అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించడం, కొత్తలైన్ ఏర్పాటు వంటిపనులను వేగవంతంగా చేయాలని అన్నారు. హుస్నాబాద్ నుంచి కొత్తపల్లి వరకు నిర్మంచనున్న ఈ రోడ్డు కోసం కరీంనగర్ జిల్లా పరిధిలోని గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్, జంగపల్లి, తదితర గ్రామాల పరిధిలో రోడ్లను ఆనుకొని ఉన్న బావులను పూడ్చివేయాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్, జిల్లా అటవీశాఖఅధికారి బాలామణి, ఆర్అండ్‌బి ఈఈ నరసింహాచారి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సోయం బాపూరావు, తెల్లం వెంకట్రావులపై చర్యలు తీసుకోవాలి

● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రికి గిరిజన సంఘాల వినతి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

భగత్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు గిరిజన సంఘాల నాయకులు గురువారం వినతి పత్రం అందించారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని మాట్లాడిన సోయం బాపూరావు, తెల్లం వెంకట్రావులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భూక్య తిరుపతి నాయక్, గుగులోతు తిరుపతి నాయక్, రాజునాయక్, రవినాయక్, సదానందం, లక్పతినాయక్, మురావత్ సంతోష్, రాజన్‌నాయక్, లాకావత్‌రవి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన నవోదయ విద్యార్థులు



జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులు

చొప్పదండి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు నవోదయ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఒంగోల్‌లో జరిగిన రీజనల్‌స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. పదవతరగతి విద్యార్థి వంశీ, తొమ్మిదవ తరగతి విద్యార్థి కార్తి కేయ ఇండిజెనియస్ టాయ్స్‌మేకింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. జాతీయస్థాయి పోటీలు ఢిల్లీలో జరగనుండగా ఆర్ట్ టీచర్ గోక నాగేశ్వర్‌రావు, విద్యార్థులను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

లింగన్నపేటలో దొంగతనం

గంభీరావుపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం లింగన్న పేట గ్రామంలో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. ఎల్లం అనేవ్యక్తి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. 2గ్రాముల బంగారం, 10వేల నగదుతోపాటు గల్ఫ్ కరెన్సీని దొంగలు ఎత్తుకెళ్లారు. ఇంటికి తాళం వేసి, పక్కనేఉన్న ఇంట్లో ఎల్లం కుటుంబీకులు నిద్రించారు. దీంతో ఇంటి తాళాన్ని పగులగొట్టి దొంగతానికి పాల్పడ్డారు.

శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల



చీమలపేట గ్రామంలో శిథిలమైన ప్రభుత్వ పాఠశాల

జూలపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపేటలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఆ పాఠశాలలో చదువుకునే 45 మంది విద్యార్థులు భయంభయంగా చదువు కొనసాగిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పైకప్పు పెచ్చులు రాలి పోవడమే కాకుండా పైకప్పు కొంత భాగం కూలిపోయి ప్రమాదకరంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పాఠశాల సమీప ఇంటిఆవరణలో అరకొర వసతులతో విద్యార్థులు చదువులను వెళ్లదీస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలకు మరమ్మతు చేయడానికి రూ.9లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఉన్నతాధికారులు విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలకు పక్కాభవనం నిర్మించి విద్యార్థులకు అన్ని వసతులను కల్పించాలని గ్రామస్థులు కోరు తున్నారు.

ధర్మపురిలో ముగిసిన భాగవత సప్తాహం

ధర్మపురి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాదద్రపద మాసం పురస్కరించుకుని ధర్మపురి పట్టణంలోని శ్రీలక్ష్మీ గణేష్ రైస్‌మిల్‌లో పురాణ ప్రవచకులు ఇనుగంటి రామ్మోహన్‌రావు గారి భాగవత సప్తాహం కార్యక్రమం గురువారం ముగిసింది. ఎనిమిదిరోజుల నుంచి రామ్మోహన్‌రావు శ్రీ కృష్ణుని చరిత, శ్రీ కృష్ణుని లీలలు, ప్రహ్లాద చరిత్ర, ధృవుని చరిత్ర, వామన చరిత్ర, భక్తుల చరిత్ర గురించి నిత్యం గంటల తరబడి ప్రవచనాలు చేశారు. వందలాది మంది ఎంతో ఓపికతో, భక్తిశ్రద్ధలతో విని శ్రవణానందం పొందారు. ముగింపు రోజున ప్రవచనాలు చేసిన ఇనుగంటి రామ్మోహన్‌రావు దంపతులను ఆలయ మాజీధర్మకర్త ఇనుగంటి రమాదేవి-వేంకటేశ్వర్‌రావు దంపతులు ఘనంగా సన్మానించి, నగదు అందించారు. కార్యక్రమంలో ప్రముఖ ట్రేడర్స్ ఇనుగంటి వినోద్‌రావు, ఇనుగంటి వేంకటేశ్వర్‌రావు, ఆర్యవైశ్య సత్రం కోశాధికారి రంగ శంకరయ్య, గునిశెట్టి మల్లేశం, భీమనాతి అశోక్, గునిశెట్టి రవీందర్, అక్కెనపెల్లి మురళీధర్, ఉత్తూరి సత్తయ్య, బొల్లం హరిప్రసాద్, నాగేశ్వర్‌రావు, కొండ వినయ్ కుమార్, రంగ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.4 కోట్లతో పరారైన దంపతుల పట్టివేత

● బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో గుగ్గిళ్ల రమేష్-గాయత్రి దంపతులు రూ.1.40కోట్లతో నాలుగు నెలల క్రితం ఉడాయించగా బుధవారం బాధితులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ప్రైవేట్‌ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తున్న రమేష్ గ్రామంలో చిట్టీలతోపాటు ఫైనాన్స్ నడుపుతుండేవాడని బాధితులు తెలిపారు. చిట్టీ అవసరం లేని వారిని గుర్తించి వారికి వచ్చే డబ్బులను తమ వద్దనే ఉంచుకొని వడ్డీ ఇస్తామని చెప్పేవారు. అదేవిధంగా గ్రామంలో కొంత మంది వద్ద పెద్దమొత్తంలో అప్పు తీసుకున్నట్లు తెలిసింది. డబ్బులు తిరిగే చెల్లించలేక నాలుగునెలల క్రితం రమేష్-గాయత్రి దంపతులు గ్రామం నుంచి పరారయ్యారు. దీంతో బాధితులు వీరికోసం వెతుకుతుండగా బుధవారం సాయంత్ర కోరుట్ల కోర్టు వద్ద రమేష్ కనిపించాడు.

బాధితులు రమేష్‌ను పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. కొంతమంది బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. కాగా రమేష్-గాయత్రి దంప తులు ఇప్పటికే కోర్టు నుంచి బాధితులకు నోటీసులు పంపినట్లుగా తెలుస్తోంది.

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులుగా పలువురి ఎంపిక



డాక్టర్ కోదూరి శ్రీవాణిని అభినందిస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్/ఎలిగేడు/పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర విభాగం అధిపతిగా, విశ్వవిద్యాలయ అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కోడూరి శ్రీవాణి, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా కే.అర్జున్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు. వీరు సెప్టెంబర్ 5 జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం హైదరాబాదులోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకోనున్నారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడుకు చెందిన శ్రీవాణి శాతవాహన విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర విభాగంలో సీనియర్ సహాయ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్నారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే పరిశోధనా రంగంలో అత్యుత్తమ పనితీరును కనబరుస్తున్నారు. ఈ సంద ర్భంగా కోడూరి శ్రీవాణిని ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్ అభినందించారు.



డాక్టర్ కె అర్జున్

పెద్దపల్లి జిల్లా నిమ్మనపల్లికి చెందిన అర్జున్ 12 సంవత్సరాలుగా కామర్స్ బోధనతో పాటు 12 జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో తన పరిశోధనన పత్రాలను ప్రచురించారు. ఈ సందర్భంగా అర్జున్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే. రామకృష్ణ, టిజిసిజిటిఏ. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ నితిన్ పాఠక్ అధ్యాపకులు అభినందించారు.

జగిత్యాల నుంచి..

జగిత్యాల: రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులుగా జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో రసాయన శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ నీలి వాసవి, ఎస్‌కేఎన్‌ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న జంతు శాస్త్ర లెక్చరర్ పార్లపల్లి రాజు ఎంపికయ్యారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు జాబితాలో నీలివాసవి, రాజుకు అవ కాశం దక్కింది. శుక్రవారం హైదరాబాద్‌లో జరుగనున్న కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. కాగా రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలిగా ఎంపికయిన డాక్టర్ నీలి వాసవిని మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్, చరిత్ర లెక్చరర్ సాసాల మల్లికార్జున్, ఇంగ్లీష్ లెక్చరర్ జ్యోష్ణ, తెలుగు లెక్చరర్ డాక్టర్ జి శ్రీలత తదితరులు అభినందనలు తెలిపారు.



డాక్టర్ నీలి వాసవి



పార్లపల్లి రాజు

ఉత్తమ లైబ్రేరియన్‌గా శంకరయ్య

కోల్‌సిటీటౌన్ : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుల అవార్డుకు గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ పల్లె శంకరయ్య ఎంపికయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చల్లగరిగ గ్రామానికి చెందిన శంకరయ్య 2002లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్‌లో గెజిటెడ్ లైబ్రేరియన్‌గా నియమితులయ్యారు. 2024లో గోదావరిఖనికి బదిలీపై వచ్చారు. 32ఏళ్లుగా విద్యారంగంలో సేవలు అందిస్తున్న శంకరయ్య, ఎన్‌సీసీ ప్రోగ్రాం అధికారిగా 18ఏళ్లు పనిచేశారు. శంకరయ్యకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంపై గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం హర్షం వ్యకర్తం చేసింది.

ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం

జగిత్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మొదటి ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అలియా మక్సూద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ కొట్టాల తిరుపతిరెడ్డి, అధ్యాపకులు తిరుపతి, రజ్యాన, సునిత, సుమేర, శిల్ప, శ్రీలత, మాధవి, రాజయ్య, సాజిద్, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌తో పాటు వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సరస్వతి శిశుమందిర్‌లో కరస్పాండెంట్ సీలి శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ రవికిరణ్, చంద్రమోహన్, అందె శివప్రసాద్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

●**కోరుట్ల రూరల్:** మండలంలోని అయిలాపూర్ గ్రామంలో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో పాటు ఆక్షర స్కూల్, సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు గంగాధర్ గౌడ్, నవీన్ పాల్గొన్నారు.

●**మెట్‌పల్లిటౌన్:** పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రైవేట్ పాఠశాలలో గురువారం ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. పట్టణంలోని నిఖిల్ భరత్ కాన్వెంట్ స్కూల్‌లో, సరస్వతి శిశు మందిర్‌లో విద్యార్థులు నృత్యాలు అలరించుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహర్షి, బెజ్జరపు మురళి, జ్ఞానోదయ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఇట్టెందుల శ్రీనివాస్,నవీన్,తుక్కారం, తదితరులు పాల్గొన్నారు.




జగిత్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేడుకలు, కోరుట్లలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానం

●**మల్యాల:** సమాజ చైతన్యం, సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులు దిక్సూచిలాంటి వారని మండల విద్యాధికారి ఎన్.జయసింహరావు అన్నారు. మండలంలోని లంబాడిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ముందస్తు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రవీందర్, విద్యార్థులు పాల్గొని ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన తొమ్మిది మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను ఎంఈవో జయసింహరావు సత్కరించారు. నూకపల్లి మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో విద్యార్థుల రంగవల్లికలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

●**ఇబ్రహీంపట్నం:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ముందస్తుగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమకు గురువులను పూర్వ విద్యార్థులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మధు, కోటగిరి వెంకటస్వామి, జాజాల జగన్ రావు, సింగని మారుతి, చంద్రశేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

●**రాయికల్:** రాయికల్ మండల కేంద్రంలోని శ్రీ గ్రీన్ వుడ్ పాఠశాలలో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మట్టపల్లి మహేష్ రెడ్డి, డైరెక్టర్ కాటర శ్రీనివాస్ రెడ్డి, అనిత, యజ్ఞశ్రీ, రాజేష్ పాల్గొన్నారు.

●**మైతాపూర్** ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

●పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

●**మల్లాపూర్:** మండల కేంద్రంతో పాటు కొత్తదాంరాజుపల్లి, తదితర గ్రామాల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంఆర్సీలో ఉత్తమ ఉపాధ్యాయులను అధికారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

●**వెల్గటూర్:** మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. పైడిపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఆగమయ్య, సతీష్ కుమార్, సునీతలను తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గాలి పర్వతాలు, హరీష్, సంతోష్, వేణు, చందు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

రాయికల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన పంటలను గురువారం పొలాస పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు పరిశీలించారు. మండలంలోని బోర్నపల్లి గ్రామంలో వరి, మొక్కజొన్న, పత్తి పంటలను సందర్శించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు స్పందన భట్, రవి, సుమలత, రాజేష్, రామకృష్ణ, శ్రీకాంత్, ఏఈవో నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల నుంచి రక్షించాలని వినతి

రాయికల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో పెరుగుతున్న కుక్కల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్‌కు గురువారం పట్టణ ప్రజలు వినతి పత్రం సమర్పించారు. రోజురోజుకు కుక్కల బెడద పెరిగి, పట్టణవాసులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ఇటీవల పదుల సంఖ్యలో పిల్లలు, పెద్దలపై కుక్కలు దాడి చేశాయని, విపరీతమైన చర్య వ్యాధులు కలిగిన కుక్కలు సంచరిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గట్టు కిషన్, నవీన్, వాసం గంగాధర్, కళ్యాణ్, శ్రీనివాస్, సతీష్, శంకర్, నర్సయ్య, సుమన్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణ బాధ్యత వారసులదే

జగిత్యాల అర్బన్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల సంరక్షణ బాధ్యత వారసులదే అని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ అన్నారు. కన్నతల్లి దండ్రులను పోషించక నిరాదరిస్తున్న కొడుకులకు వారి కోడళ్లకు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలోని సీనియర్ సిటిజన్స్ కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు పిసి హన్మంత్ రెడ్డి, గౌరిశెట్టి విశ్వనాథం, బొల్లం విజయ్ కుమార్, డిండిగాల విఠల్, వెల్మల ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

గురుకుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

మల్లాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :గురుకులంతో పాటు పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మండల వైద్యాధికారి వాహిని సూచించారు. గురువారం మండల కేంద్రంలోని మినీ గురుకుల హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాంమోహన్, ఎంఎల్‌హెచ్ అంజయ్య, వార్డెన్ లక్ష్మిప్రియాంక, ఆశాలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

కొడిమ్యాల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని మల్యాల సీఐ నీలం రవి అన్నారు. గురువారం మండల కేంద్రంలో, మండలం లోని నాచుపల్లి, పూడూర్, రామకిష్టాపూర్, చెప్యాల గ్రామాలలో గణేష్ మండపాల నిర్వాహకుల సహకారంతో 25 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విచారణ వేగవంతం చేయటానికి ఉపయోగపడుతాయన్నారు. సీఐ వెంట కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్, ఆయా గ్రామాల ప్రముఖులు ఉన్నారు.

చెరువులకు జల కళ..

(3వ పేజీ తరువాయి)

(3వ పేజీ తరువాయి)

4.59, భీమారంలో 1.78, కథలాపూర్‌లో 1.95, మేడిపల్లిలో 2.84, మెట్‌పల్లిలో 4.62 మీటర్లుగా భూగర్భ జలమట్టం నమోదైంది.

●**వరి సాగు అధికంగా..**

జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 3,86,510 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు జిల్లాలో 3,85,955 ఎకరాల్లో సాగు చేసి 99.86 శాతం నమోదైంది. ఇందులో ప్రధాన పంటగా వరి 3.13 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తి చేశారు. జిల్లాలో చెరువులు, కుంటలు నిండుకుండలా మారడం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాకతీయ కాలువ, వరద కాలువ ద్వారా సమృద్ధిగా నీరు అందుబడదంతో సాగు మరింత అధికమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

●**జిల్లాలో రూ.58.27 కోట్ల వరద నష్టం**

జిల్లాలో గడిచిన నెలలో కురిసిన వర్షాల వల్ల రూ.58.27 కోట్ల నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. వరదల వల్ల జరిగిన నష్టం పనులను తాత్కాలికంగా, శాశ్వతంగా పూర్తి చేయడానికి సంబంధిత నివేదిక అవసరమని ప్రతిపాదనలు తయారు చేశారు. జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పరిధిలో 16 రహదారులకు రూ.1,765 లక్షలు, పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న 55.60 కిలోమీటర్ల రహదారులకు 1,963లక్షలు, ఆరు ప్రాంతాల్లో బ్రిడ్జిలకు రూ.70 లక్షలు, రోడ్లు భవనాల శాఖ పరిధిలోని మూడు ప్రాంతాల్లో రూ. 1,700 లక్షలు, విద్యుత్ పనులకు 11 కేవీ 0.90 లక్షలు, ఎల్‌టీ పనులకు 1.80 లక్షలు, డీటీఆర్ పనులకు 1.00 లక్షలు, విద్యా శాఖ ఆధ్వర్యంలోని రూఫ్, ఫ్లోరింగ్, కాంపౌండ్ వాల్, టాయిలెట్స్, వాల్స్ 28 పనులకు రూ.149.45 లక్షలు, డీఎంహెచ్‌వో 8 పీహెచ్‌సీలకు రూ.26.50 లక్షలు, చిన్న నీటి పనులు 3 పనులకు 21.75 లక్షలు, సంక్షేమశాఖ పరిధిలో 46 అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.102.80 లక్షలు, అర్బన్‌మ్యాన్ పనులకు రూ.25 లక్షలు అవసరమని అధికారులు అంచనా వేశారు.

వైభవంగా గణేష్ నిమజ్జనాలు



వెల్గటూర్ మండలంలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

కోరుట్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వివిధ ప్రాంతాలలో గురువారం మండపాల నిర్వాహకులు వినాయక నిమజ్జనం చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రతిష్ఠాపన చేసిన విగ్రహాను బీఆర్ఎస్ నాయకులు ఉత్తర పూజలను నిర్వహించి నిమజ్జనకు తరలించారు. పట్టణ శివారులోని వాగువరకు నిర్వహించిన శోభాయాత్ర అనంతరం వినాయకులను వాగులో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ఎస్ఐ చిరంజీవి ప్రత్యేక చర్యలను తీసుకొని మొబైల్ వాహనం ద్వారా పెట్రోలింగ్ నిర్వహించారు.

●**వెల్గటూర్:** గణేష్ నవరాత్రుల్లో భాగంగా గురువారం మండపాల వద్ద వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రి పూట భజన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కాగా మరికొన్ని చోట్ల తొమ్మిది రోజులు పూజలు అందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి బయలు దేరారు. ఆయా గ్రామాలలో చిన్న, పెద్ద తేడా లేకుండా డీజే చప్పుళ్లకు స్టెప్పులు వేస్తూ గణేష్ శోభాయాత్రలో పాల్గొన్నారు.

అనంతరం సమీప జలాశయాలలో వినాయకుడిని నిమజ్జనం చేశారు. మరి కొందరు గోదావరిలో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై ఉమాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు పర్యవేక్షించారు.

●**ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం మండలంలోని గోదూర్ తిమ్మాపూర్ యామాపూర్ వేములకుర్తి తదితర గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం చేశారు. తొమ్మిది రోజులుగా గ్రామాల్లో వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అన్నదాన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించి గురువారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. పోలీసులు తగు బందోబస్తు చేపట్టారు.

అందని బీఎస్ఎన్ఎల్ సిగ్నల్

● వినియోగదారులకు తీవ్ర అసౌకర్యం

మల్యాల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్ సంస్థ సెల్ సేవలు మూడు రోజులుగా నిలిచిపోయాయి. మంగళవారం సాయంత్రం నుంచి సేవలు అందకపోవడంతో వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారు. మల్యాల మండలంలో వేలాది మంది బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఉండగా సెల్‌సేవలు నిలిచిపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే రోజుల తరబడి సేవలు అందించకపోవడంపై వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరుపుకోవాలి



మాట్లాడుతున్న మెట్‌పల్లి సీఐ అనిల్

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జన ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని మెట్‌పల్లి సీఐ అనిల్ మండప నిర్వాహకులకు సూచించారు. గురువారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయ ఆవరణలో పట్టణంలోని పలు వినాయక మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లర్లు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** వినాయక నిమజ్జనాలను ప్రజలు ప్రశాంతంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ కోరారు. గురువారం మండలంలోని పూడూర్ గ్రామంలో వినాయక మండపాల నిర్వాహకులు సీసీ కెమెరాల ఏర్పాటుకు 20వేల రూపాయలను ప్రోగు చేసి సీసీ కెమెరాల దుకాణం దారులకు అందించారు.

ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నిమజ్జన సమయంలో ప్రజలు భక్తి శ్రద్ధలతో ఉండాలన్నారు. ఊరేగింపు సమయంలో డీజేలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. నిమజ్జనం చేసే క్రమంలో డీజేలను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా ఓనం వేడుకలు

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీలో ముందస్తు ఓనమ్ పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కేరళ సాంప్రదాయ దుస్తులతో హాజరై, పూలరంగవల్లిల అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, నృత్యాలు, నాటికలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను కనబర్చారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనికరావు, అజిత, కేరళ ఉపాధ్యాయులు మోలీ, రాజేష్, అనురాజ్, శ్రీనందిని పాల్గొన్నారు.

●కోరుట్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నవజ్యోతి హైస్కూల్‌లో హోనం వేడుకలను గురువారం పాఠశాల నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సుకుమారన్, ప్రిన్సిపాల్ సుజాత పాల్గొన్నారు.

●**మల్యాల:** మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల ఆర్చిడ్ ఈ టెక్నో స్కూల్, మల్యాలలోని వాగ్దేవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో గురువారం ఓనమ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేరళ రాష్ట్రంలో జరుపుకునే ఈ వేడుకను విద్యార్థులు, మహిళా అధ్యాపకులు పూలతో రంగవల్లికలు వేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల నిర్వాహకులు వసఆనరేందర్‌రెడ్డి, పోతు నరేశ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రిలో ల్యాబ్, స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్ లను పరిశీలించారు. ఫార్మసీ విభాగంలో అవసరమైన మందులు అందుబాటులోని స్టాక్ వివరాలు, అత్యవసరమైన మందుల వివరాలను అడిగితెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మధుసూదన్, జిల్లా వైద్యాధికారి ప్రమోద్, తహసీల్దార్ అరుణ్‌కుమార్, తదితర అధికారులు పాల్గొన్నారు.

'ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరగలేదు'

కొడిమ్యాల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల సింగిల్‌విండో పరిధిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు జరుగలేదని సింగిల్ విండో చైర్మన్ మెన్నేని రాజనర్సింగారావు అన్నారు. గురువారం సింగిల్ విండో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ సిబ్బంది వలన కొనుగోలు కేంద్రాలలో తమకు ఇబ్బందులను ఎదుర్కొన్నామన్నారు. ఎవరైనా రాత పూర్వక ఫిర్యాదు చేసినట్లయితే విచారణ చేసి సంబంధిత ఉన్నత అధికారులకు చర్యల నిమిత్తం నివేదిక అందిస్తామన్నారు. సమావేశంలో పర్సన్ ఇంచార్జులు గంగారాం, ఆనందం, శంకర్, రమేష్, శ్రీనివాస్, కార్యదర్శి పొన్నాల గంగాధర్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ రమణ జన్మదిన వేడుకలు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎల్.రమణ జన్మదిన వేడుకలను గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గట్టు సతీష్ ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వళ్లికి ఆవాసంలోని విద్యార్థులకు భోజనం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వొల్లం మల్లేశం, ఆనంద రావు, శివకేసరి బాబు, దేవేందర్ నాయక్ ఉన్నారు.

పుట్టినరోజు వేడుకల్లో కవిత ఫొటో వివాదం

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ రమణ నివాసంలో జన్మదిన వేడుకలను నిర్వహించే సమయంలో బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ కు గురైన కవిత ఫొటో ఫ్లెక్సీలో ఉండటంతో కాస్త వివాదం తలెత్తింది. కొంత మంది కవిత ఫొటోపై బీఆర్ఎస్ స్టిక్కర్ వేయాలని మరి కొంత మంది స్టిక్కర్ వేయవద్దంటూ వాగ్వాదానికి దిగారు. చివరికి కవిత ఫొటోతో కూడిన ఫ్లెక్సీ ఎదుటనే ఎమ్మెల్సీ రమణ జన్మదిన వేడుకలను నిర్వహించారు.

గాన కోకిల కళానికేతన్ వార్షికోత్సవం

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలోని విద్యానగర్ గార్డెన్‌లో గురువారం రాత్రి గాన కోకిల కళానికేతన్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ రమణ, మాజీ మంత్రి జీవన్‌రెడ్డిలు హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రమణ జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డితో పాటు పలువురు కళాకారులు తమ ఆట, పాటలతో ఆకట్టుకున్నారు.

బీజేపీ నాయకుల ధర్నా

జగిత్యాల అర్బన్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో వినాయక చవితి ఏర్పాట్ల విషయంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని హిందు పండుగలంటేనే మున్సిపల్ అధికారులు చిన్న చూపని జగిత్యాల బీజేపీ నాయకులు ఆరోపించారు. వినాయక చవితి ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు మున్సిపల్ అధికారులు చేయకపోవడాన్ని నిరసిస్తూ గురువారం జగిత్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో బీజేపీ నాయకులు కొక్కు గంగాధర్, ఏసీఎస్ రాజు, రాగిళ్ల సత్యనారాయణ, ఆముద రాజు, దాసరి పవన్ సింగ్, సిరికొండ రాజన్న, సంబారి కళావతి, మెడిపెల్లి ప్రపన్న, దురిశెట్టి మమత, భానుప్రియ, ఇడ్దాల మహేష్, మేడిపెల్లి పుప్పరెడ్డి, మేకల లక్కీ, తదితరులు పాల్గొన్నారు.

మృతుడికి ఘన నివాళి

వెల్గటూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కప్పారావుపేటకు చెందిన గంధ రంగారావు అంతిమయాత్రలో గురువారం సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించి, కుటుంబీకులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రంగారావు ఈ నెల 2న మృతి చెందగా గురువారం అంతిమయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పొనుగోటి శ్రీనివాస్ రావు, మద్దెల గోపాల్‌రెడ్డి, గూడ రాంరెడ్డి, రాంమోహన్‌రావు, బషీర్, గోల్ల తిరుపతి పాల్గొన్నారు.

●రంగారావు అంతిమ యాత్రలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు. కుటుంబీకులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట చల్లెడ నర్సింహారావు, ఓరుగంటి రమణారావు, గంగుల అశోక్, రత్నాకర్, పత్తిపాక వెంకటేష్, సత్యం, జగన్ ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ధర్మపురి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ మామిడాల శంకరయ్య గుండె పోటుతో మృతి చెందగా కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన శంకరయ్య మృతి వివరాలు అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే జైనా గ్రామానికి చెందిన జాడి రాజశేఖర్ అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను కూడా మాజీ మంత్రి ఈశ్వర్ పరామర్శించారు. ఆయన వెంట ధర్మపురి మాజీ ఎంపీపీ సౌళ్ల భీమయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేష్‌కుమార్, తిమ్మాపూర్ పీఏసీఎస్ చైర్మన్ సాయిని సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కుడిక్యాల మహేష్, కళ్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు



ధర్మపురిలో పూజలో పాల్గొన్న మంత్రి అడ్లూరి



పెగడపల్లి మండలంలో కుంకుమపూజలు

ధర్మపురి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని పలు వీధుల్లో నెలకొల్పిన వినాయక మండపాల్లో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. వెంగ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గణనాథుడికి పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సత్రంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గణనాథుడికి 108 రకాల పిండి పదార్థాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఆర్యవైశ్య వర్తక సంఘం మండల, పట్టణ శాఖల అధ్యక్షులు కూరగాయల సంతోష్‌కుమార్, మురికి శ్రీనివాస్, అక్కెనపెల్లి రాజేందర్ పాల్గొన్నారు.

●**మెట్‌పల్లిటౌన్:** పట్టణంలోని టీచర్స్ కాలనీలో శ్రీ సిద్ధి వినాయక మండపంలో గణనాథునికి 51 ప్రసాదాలతో భక్తులు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో శ్రీ సిద్ధి వినాయక కార్యనిర్వాహక కమిటీ సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి రూరల్:** జగ్గాసాగర్ గ్రామంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మహిళలు భక్తి శ్రద్ధలతో గణపతి పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, భక్తులు, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** పెగడపల్లి మండలంలో గురువారం గణేష్ మండపాలలో కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. నవరాత్రోత్సవాలలో భాగంగా తొమ్మిదవ రోజైన గురువారం అన్న ప్రసాద వితరణలు, కుంకుమ పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు.

●**బీర్పూర్:** మండల కేంద్రంలోని శాంతిస్వూపం సమీపంలో గల వినాయక మండపాల వద్ద, తుంగూర్ గ్రామంలోని వినాయక మండపాల వద్ద మహిళలు కుంకుమ పూజలను నిర్వహించారు. మండపాల నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రంలో రెడ్ స్టార్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సామూహిక కుంకుమ పూజలను చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

●**మల్యాల:** గ్రామాల్లో కొలువుదీరిన గణనాథుడు ఘనంగా పూజలు అందుకుంటున్నాడు. ముత్యంపేటలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై నరేష్‌కుమార్, ఏఎంసీ వైస్‌చైర్మన్ బత్తిని మల్లేశం, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆన్‌లైన్‌లో సాగు వివరాలు నమోదు చేయాలి'



పంటల నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

మల్లాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతు సాగు చేస్తున్న పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని ముత్యంపేట, చిట్టాపూర్, సిర్పూర్, మల్లాపూర్ గ్రామాల్లోని పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, ఈ పాస్ మిషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను డీలర్లు ఈ పాస్ మిషన్ ద్వారానే విక్రయాలు చేయాలని సూచించారు. యూరియా కోసం రైతులు ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. గ్రామాల్లో సాగుచేస్తున్న పంటల వివరాలను అధికారులు తెలియజేస్తూ ఆన్‌లైన్ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో లావణ్య, ఏఈవోలు గజానంద్, వంశీ, రైతులు లింబారెడ్డి, అచిరెడ్డి, కొప్పుల రవీందర్, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గురువారం మంత్రి సీతక్కకు అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందించారు. హైదరాబాద్‌లోని మంత్రి ఛాంబర్‌లో సీతక్కను సిపిఐ జాతీయ నాయకుడు చాడ సురేష్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్స్ (ఎఐటీయుసి) రాష్ట్ర అధ్యక్షురాలు సాయి ఈశ్వరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సందారి కరుణకుమారి, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ నీలాపుమాల్కిలు రాష్ట్ర మంత్రి సీతక్కను కలిసి వినతి పత్రం అందించారు.

● **సంక్షిప్తం..**

●**కథలాపూర్:** సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేలా తెలంగాణ సర్కారుకు బుద్ధి ప్రసాదించాలని మండలంలోని సిరికొండలో బీజేపీ నాయకులు విఘ్నేశ్వరునికి గురువారం వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు మారుతి, శ్రీనివాస్ ఉన్నారు.

●**కథలాపూర్:** మండలంలోని పెగ్గెర్ల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా సౌల్లం గంగారాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

●**ధర్మపురి:** ధర్మపురి పట్టణంలోని ఆంగ్లోవేదిక్ కాన్వెంట్ హైస్కూల్‌లో 2025 సంవత్సరానికి గురువారం ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సంగనభట్ల దినేష్, పాఠశాల ప్రిన్సిపాల్ తోట శంకర్, డైరెక్టర్ గట్ట శ్రీనివాస్, సంగనభట్ల సంతోష్ పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి రూరల్:** ప్రస్తుతం గ్రామాల్లో కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి అంజిరెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని జగ్గాసాగర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సమావేశంలో ఆయన డాక్టర్ అంజిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎన్ఎమ్, ఆశావర్కర్లు, పాల్గొన్నారు.

●**ఇబ్రహీంపట్నం:** మండల కేంద్రమైన ఇబ్రహీంపట్నం నుండి నిర్మల్ జిల్లా కేంద్రానికి ఆర్టీసీ బస్సును మెట్ పల్లి డిపో మేనేజర్ దేవరాజ్ గురువారం ప్రారంభించారు.